# పడగ్గది వైరాగ్యం

(నవల)

---

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

ఎమెస్కో

# పడగ్గది వైరాగ్యం

**సమస్య**

"**పి**ల్లలు పడుకున్నారు, రండి, గదిలో కెళ్ళి తాంబూలం వేసుకుందాం" అంది గోముగా సుందరి – గది గుమ్మంలో నుంచుని.

"ఎందుకూ? నేను ఆరుబయట మంచం వేసుకుంటాలే. బాగా గాలేస్తుంది" అన్నాడు భర్త యోగారావు కళ్ళు తెరచి నీరసంగా.

అతడు ముందరగా భోజనం కానిచ్చొచ్చి ఆరుబయట వెన్నెట్లో చాపమీద కూర్చుని అరమూత కళ్ళతో ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో యోగాభ్యాసం చేస్తున్నాడు.

"ఆ గాలేదో గదిలోకీ వస్తుంది – కిటికీ తీసుకుంటే! రండి."

"అవుననుకో. కానీ ఈ గాలెక్కువ కదా. పైగా వెన్నెల కూడాను. వేసంకాలం వెన్నెల కదా!"

"దేంతో ఎక్కువ, ఎంతెక్కువ? ... పోనీ, ఒంట్లో నలతగా ఏమన్నా ఉందా?"

"అబ్బే, అదేం లేదే!"

"అయితే రండి!"

"ఒద్దులే, నేను వాకిట్లోనే..."

సుందరికి సహనం సహం చచ్చి అంది: "ఇట్లా నాకు దూరంగా ఉండాలనుకోవటం మీకు పుట్టిన బుద్ధేనా, లేకపోతే ఏ నపుంసకపు సన్నాసన్నా నూరిపోశాడా? ఈ చింతలపూడిలో వాడెక్కడున్నా సరే వెళ్ళి తేల్చుకొస్తాను."

"బాగుంది – ఒహడు చెప్పేదేమిటి – నాకామాత్రం తెలీదా? ఏమయినా... ఇహ తగ్గించెయ్యటం... ఆరోగ్యానికి చాలా మంచిదనుకుంటాను."

"నలభైయ్యేళ్ళకే! పైగా శాస్త్రం ఒహటా!... అసలీ విషయం మీద నేను చాలా గ్రంథాలు చదివాను–తెలుసా? క్రాఫ్ట్ – ఎబ్బింగ్, ఫోర్డ్ అండ్ బీచ్, హావలాక్ ఎల్లీస్, సి.ఇ.ఎలెన్, మార్మర్, స్టోలర్, బార్బరా, పూల్స్‌వర్త్ వగైరా వగైరా సవాలక్ష మందిని చదివాను చిన్నప్పుడే. వీళ్ళలో ఎవడూ లేక ఎవత్తీ 'చస్తావ్, ఆపెయ్ నలభైకి!' అన్లేదు. పోనీ, అందుబాట్లో వున్న డాక్టర్ని అడగరాదూ – మీ అనుమానాలన్నీ పోతాయ్!"

"ఎవర్నీ అడగను, ఇక్కడే బయట పడుకుంటాను."

సుందరి గుమ్మం వదిలి మెట్లమీద కొచ్చి కూర్చుని అంది:

"పోనీ పేపర్లో చూట్టంలే, డెభ్భయ్యేళ్ళ వాళ్ళు కూడా తండ్రులవుతున్నారనే వార్తలు! వాటిని బట్టయినా మీరు ధైర్యం తెచ్చుకోవచ్చుగా!"

"పేపరు వార్తల్ని నమ్మటమా?"

"పేపరు వార్తల్ని నమ్మరూ? అయితే ఆ తండ్రుల్నీ, సంతానాన్నీ తీసుకొచ్చి మీకు చూపిస్తేనే గాని నమ్మరా ఏం ఖర్మ!"

"సుందూ, నన్ను విసిగించకు. నా పక్కచుట్టిటు పారేయ్."

"అయితే అంతేనా?"

"అంతే."

"ఎప్పుడూ?"

యోగారావు రెండుక్షణా లాలోచించి అన్నాడు:

"ఆహాఁ, ఎప్పుడూనూ!"

ఆశ్చర్యంగా భర్తవంక చూస్తూ ఉండిపోయింది సుందరి. విసురుగా లేచింది. పడగ్గదిలో కెళ్ళి దుప్పటీ, దిండూ తెచ్చి వాకిట్లో చాపమీదే పక్కేసింది. వెళ్ళి ధడాల్న తలుపేసుకుంది.

యోగారావు నెమ్మదిగా నడుం వాల్చి నిద్రలోకి నడిచాడు.

* * *

**అ**సలు విషయం ఏమిటంటే, నలభయ్యోపడిలో పడ్డ యోగారావుకి 'సంసారం'లో థ్రిల్ తగ్గిపోతోంది. అది ఎంతవరకూ వచ్చిందంటే, 'ఎన్నాళ్ళు చేసినా ఈ సంసారమే గదా! ఇదే పడగ్గది, ఇవే మంచాలు గదా! ఎవడిదైనా ఈ పద్ధతే కదా! అసలు

'ఇందు'లో ఏముందో ఎవడికి తెలీదని!... ఈ శరీరం ఒట్టి తోలు తిత్తి, కమ్మరివాడి తిత్తులే నయం – ఆడించినంతసేపూ వాటిలో గాలి ఆడుతూంటుంది. ఈ వెధవ శరీరం అట్లా కాదే! కాస్త రోగమొస్తే ఏడుస్తూ పనిచేస్తుంది. ముసలితనం వస్తే అసలే పనిచెయ్యదు. ఏనాటికోనాటికి సప్తకట్ల సవారి ఎక్కేదే కాని, ఎల్లకాలం ఇట్లా ఉండిపోయేది కాదుగదా! దీన్ని నమ్ముకుని, 'ఆ సుఖమే' సంసారానికి పరమార్థమనుకుని జీవించటం ఎంత తెలివితక్కువ పని! కనక బుద్ధిని ఆఫీసు పనిమీదికో, పిల్లల చదువుల మీదికో, బంధువర్గాలకు సహాయపడటం వైపుకో, దేశసేవ వైపుకో ఇంకా మనసనేది ఒప్పుకుంటే ఏ దేవుడి మీదికో, ఇట్లా 'దాని' మీంచి తప్పించి ఇంక దేనిమీదకైనా మళ్ళించటం ఉత్తమ మార్గం. అంతేకాని, "పెళ్ళామూ–పడగ్గదీ" అనుకుంటూండటం ఇహ ఎంతమాత్రం మంచిది కాదు.'

–ఇట్లా యోగారావుకు ఆలోచనలు రావటం మొదలు పెట్టాయి. క్రమంగా భార్య సుందరితో ఒంటరిగా కలిసి కూర్చోవాలన్నా, ఆమెను తాకాలన్నా, అసలామె మొహంలోకి 'ఆ' భావంతో చూడాలన్నా అతనికి చిరచిరగా ఉంటోంది. ఆమెతో కలిసి ఒకే మంచంమీద పడుకోవటం ఇంచుమించు మానేశాడు. పిల్లలమధ్య మంచం వేయించుకోవడం మొదలుపెట్టాడు.

భార్యను 'తల్లీ' అని పిలవాలన్న ఉబలాటం కూడా అతనిలో ప్రవేశించకపోలేదు.

సుందరి తన భర్తలో వస్తున్న మార్పును గుర్తించింది. అయినా తెగించి 'మీ కొచ్చిన జబ్బేమిటి?' అని ఎదుటపడి అడగలేకపోయింది. ఏ భార్య మాత్రం సిగ్గువిడిచి తన మొగుణ్ణి అట్లా అడుగుతుంది! అట్లా అని 'పోనీలే ఈ పదిహేనేళ్ళ బట్టీ అనుభవించిందేదో అనుభవించాను. ముప్పయ్యయిదేళ్ళొచ్చాయి నాకయినా. ఇంకా 'దాని' మీద మోజేమిట్లే అనుకొని వూరుకోనూ లేకపోయింది.

ఎట్లా వూరుకుంటుంది – ఏభయ్యేళ్ళ స్త్రీలు కూడా టెర్లిన్ చీరలు కట్టుకొని సినిమాహాల్లో తమ పిల్లలు కూర్చున్న వరసలో కాకుండా, వేరే వరసలో మొగుళ్ళతో కలిసి కూర్చుని నాగేశ్వరరావు సినిమాలు చూస్తున్న రోజులయితేనూ!

ఉండి ఉండి, ఆపుకోలేక ఒక రాత్రి భోజనాలయ్యాక వంటిల్లు గడియ పెట్టి వచ్చింది సుందరి. ముఖానికి స్నో పూసుకుని, చీరమార్చి కట్టుకుని, జడ వదులుగా వేసుకుని, తమలపాకులూ వక్కపొడితో గది గుమ్మంలో కొచ్చి నుంచుని భర్తతో అంది:

"పిల్లలు పడుకున్నారు – రండి, గదిలో తాంబూలం వేసుకుందాం."